జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM
సోమవారం
07-09-2026
సంపుటి 1 సంచిక 286
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



## కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

4లో



# ఢిల్లీలో కుప్పకూలిన భవనం

ఢిల్లీ: నైరుతి ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఒక భవనం(Building Collapses) ఈ మధ్యాహ్నం కూలిపోయింది. భవనం శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. కనీసం నలుగురిని రక్షించగా, శిథిలాల కింద ప్రాణాలతో ఉన్న మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోంది. ఆ భవనం Paying Guest వసతి గృహంగా ఉపయోగించబడుతోంది. మధ్యాహ్నం సుమారు 1:30 గంటలకు అది కూలిపోయిందని అధికారులు తెలిపారు. భవనం కూలిపోయిన(Delhi Building Collapse) సమయంలో కనీసం 50 మంది విద్యార్థులు లోపల ఉండి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం కావడంతో చాలామంది ఇంట్లోనే ఉన్నారని, ఘటనా స్థలంలో ఉన్న ఒక విద్యార్థి, శిథిలాల కింద నుంచి సహాయం కోసం అరుపులు వినిపించాయని స్థానికులు పేర్కొన్నారు. భవనం ఉన్న ప్రదేశంలో పెద్ద సంఖ్యలో జనం గుమిగూడగా, అగ్నిమాపక సిబ్బంది శిథిలాల కింద ప్రాణాలతో ఉన్నవారి కోసం వెతుకుతున్న దృశ్యాలు కనిపించాయి. ఆన్‌లైన్‌లో షేర్ చేయబడిన ఒక వీడియోలో, ఒక వ్యక్తి కాంక్రీట్ స్లాబ్ కింద ఇరుక్కుని ఉండగా, మరికొందరు దానిని పైకి లేపడానికి కష్టపడుతూ కనిపించారు. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కనీసం 12 అగ్నిమాపక వాహనాలను ఘటనా స్థలానికి తరలించారు. కాంక్రీటు పలకలు, గిర్డర్లను తొలగించడానికి ఒక ఎక్స్‌కవేటర్‌ను అక్కడికి తీసుకువచ్చారు. అక్కడ పనిచేస్తున్న అగ్నిమాపక సిబ్బందికి సహాయపడేందుకు విపత్తు నిర్వహణ బృందాలను కూడా రంగంలోకి దించారు. ఈ ప్రాంతం ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలో ఉందని పోలీసులు తెలిపారు. సహాయక చర్యలు చేపడుతున్న వారికి విద్యార్థి సంఘాలు అండగా నిలిచాయి. ఈ విషాద సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదం ఎలా జరిగిందన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

### తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై

# సీఎం సీరియస్

## మెజిస్టీరియల్ విచారణకు ఆదేశాలు.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కేసు విచారణకు చర్యలు



**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు హత్యాచారానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు నివసిస్తున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, ఆసుపత్రి యాజమాన్యం లేదా సంబంధిత సంస్థ నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే అంశాలపై సమగ్రంగా విచారణ జరిపేందుకు మెజిస్టీరియల్ విచారణకు సీఎం ఆదేశించారు. మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి అమలు చేయాల్సిన నిబంధనలు పాటించారా? వసతి ప్రదేశంలో అవసరమైన రక్షణ చర్యలు ఉన్నాయా? భద్రత విషయంలో ఎక్కడైనా లోపాలు జరిగాయా? వంటి అన్ని అంశాలను విచారణలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కేసులో నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను వేగంగా సేకరించి, సమగ్ర ఛార్జ్‌షీట్‌ను త్వరితగతిన దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని సీఎం పేర్కొన్నారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే మంత్రులు

..మిగతా 4వ పేజీలో →




### బస్సు-మెట్రోకు

## ఉమ్మడి పాస్.. త్వరలోనే అమలు

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ నగర ప్రజా రవాణాలో కీలక మార్పునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆర్టీసీ బస్సులు, హైదరాబాద్ మెట్రో రైళ్లలో ప్రయాణించే వారికి ఉమ్మడి పాస్ విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. రోజువారీ, నెలవారీ ఉమ్మడి పాస్‌లను జారీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ జారీకి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదివారం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉమ్మడి పాస్ జారీకి సాంకేతికంగా తాము సిద్ధంగా ఉన్నామని అధికారులు సీఎస్‌కు వివరించినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి పాస్‌లకు సంబంధించిన డైలీ, మంత్లీ ఛార్జీలను త్వరితగతిన ఖరారు చేసి, విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని ఆయన సూచించారు. ఉమ్మడి పాస్ విధానంలో ఎంత చార్జీ వసూలు చేయాలి, రోజువారీ-నెలవారీ పాస్‌ల ధరలను ఎలా

..మిగతా 4వ పేజీలో →

# అసెంబ్లీకి డుమ్మా వద్దు

## ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయండి..

### బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ ఆదేశం



**దశ, హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరై ప్రతి చర్చలో చురుగ్గా పాల్గొనాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ, శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహం, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై నేతలతో ఆయన చర్చించారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని, ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ సూచించారు. స్పీకర్ వైఖరిపైనా ఎల్పీ సమావేశంలో చర్చించాలని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలను 15 నుంచి 20 రోజులపాటు నిర్వహించేలా బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పట్టుబట్టాలని నేతలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని, ప్రభుత్వ పనితీరు ప్రజలకు అర్థమైందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నదీ జలాల వాటాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలని పార్టీ నేతలకు స్పష్టం చేశారు.

### రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటానని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, సాగునీటి సమస్యలపై ప్రజల్లోకి వెళ్లేందుకు పాదయాత్ర చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రకు తాను నాయకత్వం వహించాలా, కేటీఆర్ చేయాలా అనే విషయంపై చర్చిస్తున్నట్లు వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై లక్ష మందితో ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు కేసీఆర్ పేర్కొన్నారు. అవసరమైతే తానే ఆందోళనకు నాయకత్వం వహిస్తానని చెప్పారు. నదీ జలాల వాటాల కోసం కూడా పోరుబాట పట్టాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా స్థానిక సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకుని ప్రజలతో మమేకం కావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ మార్గనిర్దేశం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను బలంగా వినిపిస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు.



### నగ్న ఫొటోలతో

# బెదిరింపులు

## మహిళ ఆత్మహత్యాయత్నం

**దశ, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో ఓ మహిళను నగ్న ఫొటోల పేరుతో బెదిరింపులకు గురిచేసిన ఘటన కలకలం రేపింది. సోషల్ మీడియాలో తన నగ్న చిత్రాలను పోస్టు చేస్తానంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు ఆరోపించింది. వేధింపులు తీవ్రం కావడంతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. బాధితురాలి కథనం ప్రకారం.. మఠంపల్లి మండలం బక్కమంతులగూడెంకు చెందిన మహిళను కాంగ్రెస్ నాయకుడు చింతారెడ్డి విజయభాస్కర్‌రెడ్డి వేధించాడని ఆరోపించింది. ఇంట్లో తాను ఒంటరిగా ఉన్న సమయంలో నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి తన నగ్న చిత్రాలను తీసినట్లు పేర్కొంది. అనంతరం వాట్సాప్ ద్వారా అసభ్యకర సందేశాలు పంపుతూ వేధించడంతో పాటు, తన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరించినట్లు తెలిపింది. ఈ వేధింపులతో తీవ్రంగా ఇబ్బందిపడిన

..మిగతా 4వ పేజీలో →

### ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్

# ఆత్మహత్యాయత్నం



**దశ, హైదరాబాద్:** ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్ సాయిపై ఫిర్యాదు చేసిన మూడు రోజులకే ఆమె ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. కేసులో ఈశ్వర్ సాయిని పోలీసులు అరెస్టు చేయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. గత ఆగస్టు 22న నార్సింగి

..మిగతా 4వ పేజీలో →



### పుష్కరాల నాటికి

## బాసరకు వైభవం

4లో

జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



### గ్రామాల్లో అభివృద్ధి శూన్యం..

# పారిశుధ్యం అధ్వానం

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో గ్రామంలోని పారిశుధ్య పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పేరుకుపోయిన చెత్తాచెదారం, అధ్వానంగా మారిన పారిశుధ్య వ్యవస్థపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల కోసం చేపట్టిన కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం

..మిగతా 4వ పేజీలో →

# బస్సు-మెట్రోకు ఉమ్మడి పాస్.. త్వరలోనే అమలు

**మొదటి పేజీ తరువాయి**

నిర్ణయించాలన్న అంశాలపై ఆర్టీసీ, మెట్రో అధికారులు త్వరలో సమావేశం కానున్నారు. ఈ సమావేశం అనంతరం ఛార్జీలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత పాస్‌ల జారీకి సంబంధించిన పూర్తి విధివిధానాలను ఖరారు చేయనున్నారు. ప్రస్తుతం నగరంలో ఆర్టీసీ బస్సులు, మెట్రో రైళ్లను కలిపి వినియోగించే ప్రయాణికులు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సి వస్తోంది. ఉమ్మడి పాస్ అందుబాటులోకి వస్తే ఒకే పాస్‌తో రెండు ప్రజా రవాణా సేవలను వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. దీంతో ప్రయాణికులకు సమయం ఆదా కావడంతో పాటు రోజువారీ ప్రయాణ వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో నిత్యం బస్సులు, మెట్రోను వినియోగించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ నిర్ణయం గణనీయంగా ఉపయోగపడే అవకాశం ఉంది. ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడంతో పాటు నగరంలో ట్రాఫిక్ రద్దీ, వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడంలోనూ ఈ ఉమ్మడి పాస్ విధానం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు సంజయ్ జాజు ఆదివారం మెట్రో రైలులో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సాధారణ ప్రయాణికుడిగా బేగంపేట్ నుంచి ప్యారడైజ్ వరకు మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా స్టేషన్లలో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, నిర్వహణ, రద్దీ, రైళ్ల పనితీరును పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ప్రత్యక్షంగా వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన, సురక్షితమైన ప్రజా రవాణా అందించేందుకు మెట్రో సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలు, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే తన పర్యటన ఉద్దేశమని సీఎస్ తెలిపారు. ఈ తనిఖీల్లో మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ ఎండీ అజిత్‌రెడ్డి తదితరులు సీఎస్ వెంట ఉన్నారు.






# 22ఏ, ఫీజు బకాయిలే బీజేపీ అస్త్రాలు

## అసెంబ్లీలో సమరానికి కమలనాథులు సన్నద్ధం

## ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పడేసే వ్యూహం

హైదరాబాద్, సెప్టెంబర్ 6: నేటి నుంచి ఆరంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై సమరానికి బీజేపీ(BJP) సన్నద్ధమైంది. ప్రజా సమస్యలను లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీసే వ్యూహాలతో బీజేపీ శాసనసభా పక్షం యుద్ధానికి సిద్ధమైంది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రధాన అస్త్రాలుగా విద్యార్థులు, పేదల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి(BJP Leader Alleti Maheshwar Reddy) అధ్యక్షతన పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభలో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఫీజు బకాయిలు, 22ఏ భూముల జాబితా తదితర అంశాల్లో పక్కా సబ్జెక్టుతో సభలోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించింది. ప్రశ్నోత్తరాల సమయం, స్వల్పకాలిక చర్చలు, అత్యవసర చర్చల సమయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని, ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అంశాల వారీగా ఎల్పీనేత, డిప్యూటీ ఎల్పీ నేతలతో పాటు ఇతర ఎమ్మెల్యేలకు బాధ్యతలను అప్పగించినట్టు తెలుస్తోంది. రుణమాఫీ, రైతు భరోసా, ప్రజా హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు చేపడుతున్న దీక్షలు, ఇందిరాపార్క్ వద్ద ధర్నాలను వాయిదా తీర్మానంతో లేవనెత్తాలని భావిస్తోంది. దీంతో రోడ్లపై విని పిస్తున్న ప్రజా స్వరానికి సభ లోపల కూడా బలం చేకూరి, ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కంటే ముందే ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని నిర్ణయించింది. శాంతిభద్రతలు, రైతాంగ సమస్యలు, అవినీతి ఆరోపణలను సభలో ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించింది. ఇతర ప్రతిపక్షాలతో పోలిస్తే అసెంబ్లీలో ప్రభావవంతమైన పాత్ర పోషించాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కాగా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఫీజు రీయింబర్స్ మెంట్, అవినీతి అక్రమాలపై ప్రభుత్వాన్ని సభలో నిలదీస్తామని హెచ్చరించారు. సభను నడపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని ఎద్దేవా చేశారు.



# కేసీఆర్ రాజీనామా డిమాండ్.. డైవర్షన్‌లో భాగమే

**హైదరాబాద్:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్(Kalvakuntla Chandrashekar Rao) రాజీనామా చేయాలని కోరడం డైవర్షన్‌లో భాగమేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు(Siddipet MLA Harish Rao) ఆరోపించారు. ఈ చిల్లర చేష్టలతో ప్రజల దృష్టిని మరల్చలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జా చేయడానికి సిద్దిపేటలో దండయాత్ర చేస్తారా?.. గతంలో రెండుసార్లు సీఎం రేవంత్ రెడ్డి(CM Revanth Reddy) సిద్దిపేటకు వచ్చి ఏం చేశారు? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీలో 22ఏపై పోరాటం చేస్తామని హరీష్‌రావు తేల్చిచెప్పారు.

## ఇందిరా పార్కు వద్ద టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా

ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద టీపీసీసీ(Telangana Pradesh Congress) ఆధ్వర్యంలో కాంగ్రెస్ ధర్నా ప్రారంభించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ధర్నా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు(Minister Sridhar Babu), పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు శంకర్, గణేష్, ఎమ్మెల్సీ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో

# బంగ్లాదేశ్ విద్యార్థినిపై అత్యాచారయత్నం

**అచ్యుతాపురం, :** బంగ్లాదేశ్‌కు చెందిన ఓ విద్యార్థినిపై అత్యాచారయత్నం జరిగిన ఘటన అనకాపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. సీఐ చంద్రశేఖరరావు, ఎస్సై సుధాకరరావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన విద్యార్థిని కాకినాడలో బీఫార్మసీ చదువుతోంది. కళాశాలలో పరిచయమైన సీనియర్ అచ్యుతాపురంలో నివాసముంటూ సెజ్‌లోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. పది రోజుల కిందట అచ్యుతాపురం వచ్చిన యువతి అతని గదిలోనే ఉంటోంది. స్థానికంగా మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఝార్ఖండ్‌కు చెందిన కమలేష్‌యాదవ్ (43) వెదురువాడలోని బహుళ అంతస్తుల భవనంలో గదిలో అద్దెకు ఉంటున్నాడు. బంగ్లాదేశ్ విద్యార్థిని మధ్యాహ్న సమయంలో గదిలో ఒంటరిగా ఉండటం గమనించిన కమలేష్‌యాదవ్ ఆమెపై కన్నేశాడు. యువతి స్నేహితుడు శనివారం కంపెనీలో విధులకు వెళ్లిన తర్వాత కమలేష్‌యాదవ్ అక్కడికి వచ్చాడు. మరుగుదొడ్డి శుభ్రం చేయమన్నారని ఆమెను నమ్మించాడు. కొద్దిసేపు మరుగుదొడ్డిని శుభ్రం చేస్తున్నట్లు నటించి, ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ప్రతిఘటించిన యువతి అతని నుంచి తప్పించుకుని పరుగున కిందకు వచ్చి జరిగిందంతా స్థానికులకు చెప్పింది. ఇంతలో కమలేష్‌యాదవ్ భయంతో భవనం పిల్లరు మీదుగా కిందకు జారి పారిపోయేందుకు యత్నించాడు. ఈ క్రమంలో పట్టుతప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పుష్కరాల నాటికి బాసరకు వైభవం

## జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



నిర్మల్ సెప్టెంబర్ 6: దక్షిణ భారతదేశంలోని ఏకైక సరస్వతి నిల యమైన బాసర లో గోదావరి పుష్కరణ నా టికి పనులను పూర్తి చేసి ఆధ్యాత్మిక కేం ద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా ఇన్చార్జి ,రాష్ట్ర మ ద్యం, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, జూపల్లి కృష్ణారావు(District Incharge Minister Jupally Krishna Rao) తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(Chief Minister Revanth Reddy) కృషి తో ఇప్పటికి 354 కోట్లతో బాసర పునరవభివృద్ధి పనులు జరుగుతున్నట్టు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పా రు. ఆదివారంరూ రూ.20 కోట్లతో చేపట్టను న్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.354 కోట్లతో చేపట్టనున్న ఆలయ స మగ్ర అభివృద్ధి, నూతన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆ లయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యే క పూజలు నిర్వహించారు.గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిం చేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆ దేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివ చ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృ ద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లను ని రంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్లో ప్ర త్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అ న్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.బాసరతో పాటు గోదావరి నదీ తీ ర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శా ఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఆ ధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏ ర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాద నలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృ ష్ణారావుకు వివరించారు. నిర్దేశిత గడువులో గా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలె క్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎ మ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిర ణ్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికా రులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో అభివృద్ధి శూన్యం.. పారిశుధ్యం అధ్వానం

**మొదటి పేజీ తరువాయి**

చేసిందని విమర్శించారు. 1000 రోజులు గడిచినా గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బీఆర్ఎస్ పోరుబాట చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

**మొదటి పేజీ తరువాయి**

పోలీస్‌స్టేషన్‌లో ఈశ్వర్ సాయిపై కేసు నమోదైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను మోసం చేశాడని మాధురి రాథోడ్ ఆరోపించారు. కేసు నమోదైన అనంతరం ఈశ్వర్ సాయి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఈశ్వర్ సాయి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. మరోవైపు తన ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మాధురి రాథోడ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈశ్వర్ సాయి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# నగ్న ఫొటోలతో బెదిరింపులు

## మహిళ ఆత్మహత్యాయత్నం

**మొదటి పేజీ తరువాయి**

బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే నిందితుడు అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో పోలీసులు చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారని ఆమె ఆరోపించింది. అంతేకాకుండా నిందితుడితో రాజీ చేసుకుని ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని పోలీసులు తనపై ఒత్తిడి తెచ్చారని బాధితురాలు ఆరోపించినట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసినప్పటికీ బెదిరింపులు కొనసాగడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరుతున్నట్లు తెలుస్తోంది. ఆరోపణలపై పోలీసులు తీసుకున్న చర్యలు, కేసు నమోదు వివరాలు తెలియాల్సి ఉంది.

# తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై సీఎం సీరియస్

**మొదటి పేజీ తరువాయి**

పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క కుటుంబాన్ని పరామర్శించగా, ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి త్వరితగతిన న్యాయం జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



# కోడి పందేల స్థావరం పై పోలీసుల దాడి

**దశ, ఆదిభట్ల, :** ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. మన్నెగూడ ఆర్టీవో కార్యాలయం వెనుక ఉన్న పాత పౌల్ట్రీ ఫారమ్‌లో గుట్టుచప్పుడు కాకుండా కోడిపందేలు, పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శంషాబాద్ జోన్ ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మూకుమ్మడిగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పందెం రాయుళ్లకు భోజన వసతులు కల్పించి మరీ కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లను నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో 22 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు ప్రధాన నిర్వాహకుడిగా, స్థల యజమానిగా గుర్తించిన వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోదాల్లో 31 పందెం కోళ్లు, 146 కత్తులు, 20 మొబైల్ ఫోన్లు, రూ.3.60 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మొత్తం రూ.35 లక్షల విలువైన ఆరు వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన వారిని విచారణ నిమిత్తం ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com